తపాలా సేవలతో ప్రయోజనం పొందాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్‌పీ సత్యేంద్రకృష్ణ

బన్సీలాల్‌పేట్‌: తపాలా శాఖ అధ్వర్యంలో అమలు చేస్తున్న కార్యక్రమాలను, సౌకర్యాలను, పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందాలని తపాలా శాఖ ఏఎస్‌పీ సత్యేంద్ర కృష్ణ కోరారు. ఐడిహెచ్‌ కాలనీలో స్థానిక నాయకుడు ఎల్‌. వెంకటేశన్‌ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన తపాలా సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యేంద్రకృష్ణ మాట్లాడుతూ పేద ప్రజల కోసం తపాలా శాఖ అనేక పథకాలు, సౌకర్యాలు, సదుపాయాలను అమలు చేస్తున్నదని వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎల్‌ వెంకటేశన్‌ రాజు, అంగముత్తు శ్రీనివాస్‌, గజ్జెల శ్రీనివాస్‌, కె. వెంకటేష్‌, శివకుమార్‌, శ్రీకాంత్‌, దేవేందర్‌, సదానంద్‌, ప్రదీప్‌ పాల్గొన్నారు.

ఓయూ ప్రొఫెసర్‌కు రతన్‌ టాటా అవార్డు



అవార్డును అందుకుంటున్న ప్రొ.జహంగీర్‌

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఎంబీఏ విభాగం అధ్యాపకులు ప్రొ.జహంగీర్‌ రతన్‌ టాటా ఎక్స్‌లెన్సీ అవార్డు అందుకున్నారు. శనివారం రతన్‌ టాటా జయంతి సందర్భంగా తెలంగాణ సిటిజన్‌ కౌన్సిల్‌ (టీసీసీ) ప్రొ.జహంగీర్‌ను అవార్డు ఎంపిక చేసింది. టీసీసీ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్‌ చైర్మన్‌ ప్రొ.పురుషోత్తం చేతుల మీదుగా ప్రొ.జహంగీర్‌ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి రాష్ట్ర కార్యదర్శి ప్రొ.శ్రీరామ్‌ వెంకటేష్‌, టీసీసీ అధ్యక్షులు రాజ్‌నారాయణ ముదిరాజ్‌, డాక్టర్‌ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల సమస్యల పరిష్కారానికి కృషి



సర్వే వివరాలను అడిగి తెలుసుకున్న కోట నీలిమ

అమీర్‌పేట: పట్టణ ప్రాంతాల్లో నివసించే నిరుపేదల ఇళ్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని సనత్‌నగర్‌ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల సర్వే నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం అమీర్‌పేట డివిజన్‌ బీజేఆర్‌నగర్‌లో సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పథకాలకు సంబంధించి ఇంటింటి సర్వే చేసి అర్హుల వివరాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్‌ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీనివాసుడికి ధనుర్మాస శోభ



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌ రోడ్‌ నెంబర్‌-14లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శనివారం శ్రీనివాసుడికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీగోదా రంగనాథ స్వామి అలంకరణను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. దీంతో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

సీవరేజీ పైప్‌లైన్‌ పనులు ప్రారంభం

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ రోడ్డునెంబర్‌-71లోని నవ నిర్మాణ్‌నగర్‌లో రూ.17 లక్షల వ్యయంతో సీవరేజీ అండ్‌ వాటర్‌ బాక్స్‌ టైపు నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్‌ డివిజన్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు కాటూరి రమేష్‌ మాట్లాడుతూ ఖైరతాబాద్‌ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ ఈ నిధులను మంజూరు చేయించారని, దీని ప్రారంభోత్సవంలో తాము కూడా భాగస్వాములు కావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఇక్కడ సమస్యను తెలుసుకుని నిధులు మంజూరు చేసినందుకు దానం నాగేందర్‌కు కాలనీవాసులు తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

అంతా మా ఇష్టం..

● ఇష్టానుసారం తవ్వకాలు ● అవస్థలు పడుతున్న జనం ● పట్టించుకోని అధికారులు

బన్సీలాల్‌పేట్‌: సికింద్రాబాద్‌ పరిసర ప్రాంతాల్లో విచ్చల విడిగా రోడ్లపై తవ్వకాలతో జనం పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీకావు. ప్రభుత్వ పనుల కోసం కాంట్రాక్టర్లు ఓ వైపు....ప్రైవేట్‌ వ్యక్తులు, సంస్థలు తమ అవసరాల కోసం తవ్వకాలు చేపడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ రోడ్లు, బస్తీలు, కాలనీల్లో తవ్వకాల కారణంగా రాకపోకలు సాగించే ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లపై గోతులు తవ్వి నెలల తరబడి నుంచి అలాగే వదిలేస్తున్నారు. పలు ప్రాంతాల్లో వాహనచోదకులు, పాదచారులు రాత్రి వేళల్లో చీకట్లో గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. వాస్తవానికి ఎక్కడైనా పనులు నిర్వహించుకునే వ్యక్తులు ముందస్తుగా జీహెచ్‌ఎంసీ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. అయితే చాలా మంది అనుమతులు తీసుకోకుండా తమ ఇష్టానుసారంగా రోడ్లపై తవ్వకాలు సాగిస్తున్నారు. వీటిని పర్యవేక్షించి సదరు వ్యక్తులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవలసిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే కింది స్థాయి సిబ్బంది అంతో ఇంతో దండుకొని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.



సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌ 31 బస్సు స్టాపు సమీపంలో రోడ్డుపై భారీ గొయ్యి

ఈ తవ్వకాలు ఎక్కడెక్కడంటే..

సికింద్రాబాద్‌ జీహెచ్‌ఎంసీ బేగంపేట్‌ సర్కిల్‌ పరిధిలో తవ్వకాలు సాగుతున్నాయి. బన్సీలాల్‌పేట్‌, బోయిగూడ, రాణిగంజ్‌, మోండా మార్కెట్‌, బోలక్‌పూర్‌, పాన్‌బజార్‌, సుభాష్‌ రోడ్డు, ఎం.జీ రోడ్డు, జీరా, ఓల్డ్‌బోయిగూడ, సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌ పరిసరాల్లో ఈ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. సికింద్రాబాద్‌రైల్వేస్టేషన్‌ పెట్రోల్‌ బంకు....31 బస్సు స్టాప్‌ సమీపంలోని రోడ్డుపై స్థానిక ఓ హోటల్‌ నిర్వాహకులు డ్రైనేజీ పైపులైన్‌ పనుల కోసం రోడ్డుపై తవ్వకాలు చేట్టారు. నిత్యం జన సంచారంతో రద్దీతో ఉంటే రోడ్డుపై భారీ గోతును తవ్వారు. సుమారు రెండు నెలులు గడుస్తున్నా అది అలాగే ఉంది. హోటల్‌ నిర్వాహకుడు పనులు పూర్తి చేయకుండా గోతు పూడ్చకుండా అలాగే వదిలేశారు. జనం అవస్థలు పడతున్నా జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో నడి రోడ్డుపై భారీ గోతు స్థానిక ప్రజలు, ప్రయాణికులకు గుదిబండగా తయారైంది. ఇప్పటికైనా .సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌ పోటీల్లో ప్రతిభ చూపిన రేవంత్‌



చిలకలగూడ : రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వెయిట్‌ లిఫ్టింగ్‌ పోటీల్లో సికింద్రాబాద్‌ సీతాఫల్‌మండికి చెందిన జీఎం రేవంత్‌ అద్భుత ప్రతిభ కనబర్చి సిల్వర్‌ మెడల్‌ సాధించాడు. చీఫ్‌మినిస్టర్‌ కప్‌లో భాగంగా నగరంలోని లాల్‌ బహదూర్‌ స్టేడియంలో శనివారం జరిగిన వెయిట్‌లిఫ్టింగ్‌ పోటీల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన వెయిట్‌లిఫ్టర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. 67 కిలోల విభాగంలో జీఎం రేవంత్‌ స్నాచ్‌లో 90 కేజీలు, క్లీన్‌ అండ్‌ జర్క్‌లో 110 కేజీలు ఎత్తి రెండవ స్థానం కైవసం చేసుకున్నాడు. హైదరాబాద్‌ వెయిట్‌లిఫ్టింగ్‌ అసోషియేషన్‌ కార్యదర్శి శ్రీనివాస్‌, కోచ్‌లు శివకుమార్‌, శ్రవణ్‌, రాజు, హేమలత, మహేందర్‌లు ప్రతిభ ప్రదర్శించి సిల్వర్‌ మెడల్‌ సాధించిన జీఎం రేవంత్‌ను అభినందించారు.

పీఎం విశ్వకర్మ యోజన నిరుద్యోగులకు ఉపయోగకరం

లాలాపేట: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా రాష్ట్రంలో చాలా మంది నిరుద్యోగులు వృత్తినైపుణ్య శిక్షణ పొందుతున్నారని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎన్‌. రామ్‌చందర్‌రావు అన్నారు. లాలాపేటకు చెందిన పూల వ్యాపారి బాలస్వామి ఈ పథకం ద్వారా గార్లాండ్‌ మేకింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్నారు.ఈ సందర్భంగా శనివారం తార్నాకలో మాజీ ఎమ్మెల్సీ రామ్‌చందర్‌రావును కలిసి సర్టిఫికెట్‌ను అందుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్‌గౌడ్‌, ఆకుల శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

మోడల్‌కాలనీలో హరిహర నామామృతం



హరిహర నామామృత కార్యక్రమంలో విద్యార్థులు

సనత్‌నగర్‌: విదుర శేఖర భారతీస్వామి పిలుపు మేరకు కొనసాగుతున్న హరిహర నామామృత కార్యక్రమాన్ని శనివారం సనత్‌నగర్‌ మోడల్‌కాలనీలోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న పలువురు బాలబాలికలు ఒక్కొక్కరూ 108 సార్లు చొప్పున రామనామం, శివ నామాలను రాశారు. శ్రీశంగేరీ శరదా పీఠాధిపతులు భారతీ తీర్థ మహాస్వామి సన్యాస ఆశ్రమంలోకి ప్రవేశించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన శిష్యులు విధుర శేఖర భారతీస్వామి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా హరిహర నామామృతం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారని సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి సభ్యులు, మోడల్‌కాలనీ కార్యదర్శి దండా బుచ్చిబాబు తెలిపారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న జాజుల లింగంగౌడ్‌

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమ సమయంలో పదేళ్లు, రాష్ట్రం ఏర్పడిన తర్వత టీఆర్‌ఎస్‌ పాలనలో 10 సంవత్సరాలు నష్టపోయామని కాంగ్రెస్‌ పార్టీ తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబుకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్‌ వినతిపత్రం ఇచ్చారు. వయోభారం కారణంగా ప్రభుత్వ ఉద్యోగాలు రాక, ఉపాధి అవకాశాలు లేక ఉద్యమకారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించేందుకు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కోనేటి రమేష్‌, కిరణ్‌, రమేష్‌, సోమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి



ఏఐడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్‌ రాజ్‌

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ-2020) పేరుతో విద్యారంగాన్ని గాలికి వదిలేసిందని ఆల్‌ ఇండియా డెమొక్రటిక్‌ స్టూడెంట్స్‌ ఆర్గనైజేషన్‌ (ఏఐడీఎస్‌వో) రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్‌రాజ్‌, గ్రేటర్‌ అధ్యక్షులు నితీష్‌ ధ్వజమెత్తారు. శనివారం ఓయూ క్యాంపస్‌ బాస్కెట్‌ బాల్‌ కోర్టులో ఏఐడీఎస్‌వో తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్‌ ఆధ్వర్యంలో 71వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన మల్లేష్‌ రాజ్‌ ఏఐడీఎస్‌వో జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఈపీ-2020 రద్దు చేయాలని, విద్యారంగానికి కేంద్రం 10, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్‌ విద్యార్థుల సమస్యల పై పోరాడేందుకు ఇంజివర్స్‌ కమిటీని ఏర్పాటు చేశారు. ఓయూ అధ్యక్షునిగా వినోద్‌, కార్యదర్శిగా జయంత్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

పార్టీని బలోపేతం చేస్తాం

సమాజ్‌వాది పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్‌ సింహాద్రి



లాలాపేట: సమాజ్‌వాది పార్టీ జాతీయ అధ్యక్షులు అఖిలేష్‌యాదవ్‌ పీడీఏ వ్యూహాన్ని అమలు చేసి తెలంగాణలో పార్టీని బలోపేతం చేస్తామని తెలంగాణ రాష్ట్ర సమాజ్‌ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్‌ సింహాద్రి అన్నారు. శనివారం తార్నాకలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ప్రొ. సింహాద్రి అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గం పీడీఏ వ్యూహంపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో అక్కల బాబుగౌడ్‌, బరిగెల స్వరూపారాణి, శ్రీహరి ముదిరాజ్‌,బోనాల విజయ్‌కుమార్‌ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు



సనత్‌నగర్‌: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో..)టమాటా. 11, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 18, బెండకాయ 28, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్‌ 43, పచ్చకాకర 23, పందిరి బీర 35, క్యాబేజీ 17, క్యారెట్‌ 25, దొండ 35, గుండుబీన్స్‌ 40, గింజ చిక్కుడు 40, గోకరకాయ 35, కీర 13, దోసకాయ 18, బీట్‌రూట్‌ 28, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 25, చామగడ్డ 37, మొరంగడ్డ 28, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

వేర్వేరుచోట్ల ముగ్గురి అదృశ్యం



మాధవి



కుమారస్వామి

అడ్డగుట్ట: ఊరెళ్తున్నానని చెప్పి ఒకరు, మానసిక స్థితి సరిగాలేని మరొకరు వేర్వేరు ప్రాంతాల్లో అదృశ్యమయ్యారు. తుకారాంగేట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఈమేరకు కేసులు నమోదయ్యాయి. అలాగే మారేడుపల్లిలో ఓ మహిళ అదృశ్యమంది. తుకారంగేట్‌ ఇన్‌స్పెక్టర్‌ శంకర్‌ నాయక్‌ తెలిపిన మేరకు.. తుకారాంగేట్‌లో నివాసముంటున్న మాధవి(35) అడ్డగుట్టలోని కల్లు కంపౌండ్‌లో పనిచేస్తోంది. ఈ నెల 20న ఊరికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన మాధవి తిరిగి రాలేదు. రోజులు గడుస్తున్నా ఆమె రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి...

అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన కుమారస్వామి(34) కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. కొంత కాలంగా ఇతనికి మానసికస్థితి సరిగా ఉండడం లేదు. ఈ క్రమంలో డిసెంబర్‌ 7న గుడికి వెళ్లిన కుమారస్వామి మళ్లీ తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కంటోన్మెంట్‌: హౌస్‌ కీపింగ్‌ పనికి వెళ్లిన మహిళ అదృశ్యమైంది. మారేడుపల్లి పోలీసులు తెలిపిన మేరకు.. నేపాల్‌కు చెందిన అనిల్‌ కుమార్‌, భార్య సంగీత ఇద్దరు పిల్లలతో కలిసి వెస్ట్‌మారేడుపల్లి సంజీవయ్యనగర్‌లో నివాసముంటున్నాడు. అనిల్‌ కుమార్‌ కేటగిరింగ్‌ పనిచేస్తుండగా, సంగీత హౌస్‌ కీపింగ్‌లో పనిచేస్తుంది. గురువారం ఉదయం పనికి బయలుదేరిన సంగీతకు మధ్యాహ్నం ఫోన్‌ చేయగా లిఫ్ట్‌ చేయలేదు. సాయంత్రానికి ఆమె ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ అయింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో, ఆమె ఆచూకీ కోసం అనిల్‌ కుమార్‌ తెలిసిన వారి దగ్గరి విచారించాడు. శనివారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సంగీత

మౌలిక వసతుల కల్పనకు కృషి

శ్రీనగర్‌కాలనీ: బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్‌ వనం సంగీత అన్నారు. శనివారం ఎల్లారెడ్డిగూడ వడ్డెరబస్తీ నుంచి శ్రీనగర్‌కాలనీ వైపుగా రూ. 16లక్షలతో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించారు. పెండింగ్‌ పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. నేతలు వనం శ్రీనివాసయాదవ్‌, వడ్డెర లక్ష్మణ్‌, బస్తీ నేతలు పాల్గొన్నారు.

నిత్యాన్న ప్రసాద వితరణ గొప్ప కార్యక్రమం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌



నిత్యాన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌

సనత్‌నగర్‌: ఎంతో నిష్ఠతో అయ్యప్ప స్వామిని పూజించే అయ్యప్ప భక్తులకు అల్పాహారం, నిత్యాన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని, ఇది గొప్ప కార్యక్రమమని మాజీ మంత్రి, సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ అన్నారు. శనివారం రాంగోపాల్‌పేట డివిజన్‌లోని ఆవులమందలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీధర్మ శాస్త్ర భక్త బృందం ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులక అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 సంవత్సర నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రతిరోజూ సుమారు 1000 మంది అయ్యప్పలకు మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, రాత్రి అల్పాహారం వితరణ చేస్తున్నట్లు నిర్వాహకులు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ మల్లికార్జున్‌గౌడ్‌, నాయకులు శ్రీనివాస్‌గౌడ్‌, కిషోర్‌, ఆంజనేయులు, గణేష్‌, ధర్మ శాస్త్ర భక్త బృందం ప్రతినిధులు పాల్గొన్నారు.

వెస్ట్‌ సైడ్‌ బిల్డింగ్‌లో..

ఎస్‌డీ రోడ్డులోని ముచ్చెర్ల మెన్షన్‌ బిల్డింగ్‌లో అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో కలిసి పాల్గొన్నారు. ముందుగా అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే శ్రీగణేశ్‌



తాడ్‌బండ్‌ వీరాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్‌

కంటోన్మెంట్‌: నియోజకవర్గం పరిధిలోని ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ అన్నారు. శని త్రయోదశి సందర్భంగా శనివారం తాడ్‌బండ్‌ వీరాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో ప్రసిద్ధ సికింద్రాబాద్‌ గణపతి దేవాలయం, పెరుమాల్‌ వెంకటేశ్వర స్వామి దేవాలయం, సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, తాడ్‌బండ్‌ వీరాంజనేయ స్వామి దేవాలయాలు ఉన్నాయన్నారు. వాటిని చారిత్రక వైభవం ఇనుమడింప చేసేలా మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు సహకారం అందజేస్తానన్నారు. ముఖ్యంగా తాడ్‌బండ్‌ దేవాలయానికి వచ్చే భక్తులకు సకల సదుపాయాలు కల్పించాల్సిందిగా ఆలయ నిర్వాహకులకు సూచించారు.

'విద్యారంగాన్ని పట్టించుకోని సీఎం'



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థి, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న సీఎం రేవంత్‌ రెడ్డిని గద్దెదించేందుకు పోరాడతామని ఏబీవీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీలలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన ఏబీవీపీ 43వ మహాసభలు విజయవంతంగా ముగిసినట్లు తెలిపారు. వివిధ తీర్మానాలతో పాటు సీఎం రేవంత్‌ రెడ్డిని గద్దెదించేందుకు పోరాడుతామని తీర్మానం చేసినట్లు చెప్పారు. సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రేవంత్‌ రెడ్డి విద్య రంగం సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం, ఎస్సీ, ఎస్టీ, బీసీల పెండిగ్‌ స్కాలర్‌షిప్‌ను విడుదల చేయాలేదని, బాసర ట్రిపుల్‌ ఐటీ, గురుకులాల్లో 48 మంది విద్యార్థుల మృతి, యూనివర్సిటీల అధ్యాపకుల ఉద్యోగాల భర్తీలో జాప్యం తదితర సమస్యలపై విద్యార్థులు పోరాడుతున్నా పట్టించుకోవడం లేదని ఏబీవీపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర నాయకులు జీవన్‌, పృథ్వితేజ, లివేలి రాజు, కమల్‌ సురేష్‌, శివశంకర్‌, హరిప్రసాద్‌, కళ్యాణ్‌, సంగదీ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు

ఎంపీ ఈటల రాజేందర్‌



బొల్లారం ఆసుపత్రిలో రోగుల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ ఈటల రాజేందర్‌

సాక్షి, సిటీబ్యూరో: బొల్లారంలోని కంటోన్మెంట్‌ జనరల్‌ ఆసుపత్రిలో రోగులకు పూర్తి స్థాయిలో వైద్యసేవలతోపాటు ఉచితంగా మందులు అందేలా చర్యలు తీసుకుంటామని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. శనివారం బొల్లారం ఆసుపత్రిని సందర్శించిన ఈటల ఇన్‌పేషంట్‌, అవుట్‌పేషంట్‌ రోగుల వద్దకు వెళ్ళి ఆసుపత్రిలో ఉన్న వసతులు, వారికి అందజేస్తున్న వైద్య సేవలు, ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది సమస్యలు సైతం అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని బాత్‌రూంలను పరిశీలించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు రోగులు ఆసుపత్రిలో అల్ట్రాసౌండ్‌, ఎక్స్‌రే, బ్లడ్‌ టెస్టులకు డబ్బులు తీసుకుంటున్నారని, రాత్రివేళ వైద్యులు అందుబాటులో ఉండడం లేదని, రేబీస్‌ వ్యాక్సిన్‌ లేదని ఎంపీకి పలువురు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఈటల మీడియాతో మాట్లాడుతూ ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో బొల్లారం ఆసుప్రతిని సందర్శించినట్లు చెప్పారు. కంటోన్మెంట్‌ లోని బొల్లారం ఆసుపత్రితో పాటు అర్బన్‌ హెల్త్‌ సెంటర్లల్లో డాక్టర్లు, సిబ్బంది పరికరాలు మందులు పూర్తిస్థాయిలో ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ముగిసిన క్రీడోత్సవాలు



లాలాపేట: ప్రొఫెసర్‌ జయశంకర్‌ స్టేడియంలో గత రెండు రోజుల నుంచి కొనసాగుతున్న సౌత్‌ లాలాగూడలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి వార్షిక క్రీడోత్సవాలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా సెంటినరీ బాపిస్టు చర్చి, శాంతినగర్‌ బాప్టిస్టు చర్చి ఫెయిత్‌ ఎవేంజర్స్‌ జట్ల మధ్య క్రికెట్‌ పోటీలు జరిగాయి. పోటీలో సెంటినరీ బాప్టిస్టు చర్చి క్రికెట్‌ జట్టు విజేతగా నిలిచింది. చర్చి ప్రసిడెంట్‌ ఎం. క్రిష్టోఫర్‌,వైస్‌ ప్రసిడెంట్‌ బి. ప్రవీణ్‌, సెక్రటరీ బి. వరకుమార్‌ పాల్గొన్నారు.



క్రికెట్‌ విజేతగా నిలిచిన సెంటినరీ బాప్టిస్టు చర్చి జట్టు

ఓయూలో యూజీసీ అధికారుల పర్యవేక్షణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో దివ్యాంగ విద్యార్థులు, ఉద్యోగులు అధ్యాపకుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాల అమలు తీరు పై యూజీసీ అధికారులు శనివారం పర్యవేక్షించారు. వికలాంగుల హక్కుల చట్టం అనుగుణంగా యూజీసీ మర్గదర్శకాలు అమలును పరిశీలించేందుకు ఓయూకు వచ్చిన యూజీసీ అధికారుల బృందం వీసీ ప్రొ. కుమార్‌, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం జరిపారు. అనంతరం యూనివర్సిటీలో పర్యటించి సౌకర్యాలపై ఆరా తీశారు.